పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో మాజీ ఎమ్మెల్యే చందర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ భాష, యాస ఎంతో ప్రత్యేకమైనదని భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి, వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ భాష అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి జాతీయ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చందర్, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, సంస్థ వ్యవస్థాపకులు మధుకర్ పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు


గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో మిఠాయిలు పంచుతున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో జీఎస్టీ తగ్గింపుతో నూతన వెలుగులు వెల్లివిరుస్తున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ప్రధాని మోదీ చొరవతో జీఎస్టీ తగ్గింపు అమలులోకి వచ్చిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భరత సాధ్యమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని మరోసారి నిరుపితమైందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, పురుషోత్తం, ప్రేమ్‌రాజ్, ప్రవీణ్, శంకర్ తదితరులున్నారు.

మండప నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



చాంద్రాయణగుట్ట: దుర్గమాత మండప నిర్వాహకులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. స్టేషన్ పరిధిలోని మండప నిర్వాహకులకు సోమవారం ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్‌ను విద్యుత్ అధికారుల సమక్షంలో తీసుకోవాలన్నారు. మండపాలను కూడా పకడ్బందీగా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా రాత్రి పూట ఎలాంటి ఘటనలకు తావులేకుండా నిర్వాహకులలో ఒకరిద్దరు మండపంలో నిద్రించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు హసీనా, రాజేశ్వర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


అన్వరి బేగం (ఫైల్)

డబీర్‌పురా: మహిళ అదృశ్యమైన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..యాకుత్‌పురా మౌలాకా చిల్లా ప్రాంతానికి చెందిన అన్వరి బేగం (35), మహ్మద్ అజ్హరుద్దీన్ దంపతులు. ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటలకు అన్వరి బేగం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అన్వరి బేగం తండ్రి స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తండ్రి మహ్మద్ జానిమియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


లాల్‌దర్వాజా సింహవాహినిని దర్శించుకున్న బండ్లగూడ తహసీల్దార్ సురేష్ కుమార్


గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయంలో..


చండీ హోమంలో ఆలయ అధ్యక్షుడు కట్ట నాగేందర్ తదితరులు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను, మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు చేయడంలో భక్తజనం నిమగ్నమయ్యారు. రోజుకో అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తూ భక్తులను కనువిందు చేయనున్న అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


బాలత్రిపుర సుందరి దేవీగా మీరాలంమండి అమ్మవారు


హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయంలో..


శైలపుత్రి అలంకరణలో భాగ్యలక్ష్మి అమ్మవారు


బాల త్రిపుర సుందరీ దేవిగా జమ్మిచెట్టు దుర్గమాత


గుడిమల్కాపూర్ దుర్గామాత ఆలయంలో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు


బాలత్రిపుర సుందరి దేవిగా పూజలందుకున్న జియాగూడ మహంకాళి దేవి


బాల త్రిపుర సుందర దేవిగా లక్ష్మీనర్సింహనగర్ బంగారు మైసమ్మ


పూజల్లో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్ దంపతులు


మీరాలంమండిలో సామూహిక కుంకుమార్చన


ధ్వజారోహణం చేస్తున్న ఉప్పుగూడలో ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్


హోమంలో కాట రమేష్ దంపతులు


చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయంలో..

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 53వ రామాయణ మేళా ప్రారంభం


పూజల్లో గోవింద్‌రాఠీ, కొల్లూరి పవన్‌కుమార్, సుమిత్‌రాఠీ తదితరులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో53వ రామాయణ మేళా వేడుకలు ప్రారంభించారు. సోమవారం రామాయణమేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ, ఇతర ప్రతినిధులు కొల్లూరి పవన్‌కుమార్, సుమిత్‌రాఠీ, మనోజ్ జైస్వాల్ తదితరులు అమ్మవారికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్‌రాఠీ మాట్లాడుతూ..అక్టోబర్ 2న వరకు రామాయణమేళా వేడుకలు నిర్వహిస్తామన్నారు. విజయదశమి రోజు రావణ దహనం, శ్రీరాముడి పట్టాభిషేకం, శమీపూజ, ఇతర పలు పూజా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవరాత్రుల్లో రామాయణమేళా వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గోషామహల్ అభివృద్ధికి కృషి



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర పిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్‌కు చెందిన స్థానిక నాయకులు శ్రీనివాస్ ఆయనకు వినతిపత్రం అందజేశారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..మంగళ్‌హాట్‌లోని ఇంటినెంబర్: 13-1-681 నుంచి 13-1-672 వరకు వెంటనే నూతన సీసీ రోడ్డు పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు లిఖితపూర్వకంగా విన్నవించినట్లు ఆయన తెలిపారు. మంగళ్‌హాట్‌తో పాటు ధూల్‌పేట, గోషామహల్, జుమ్మేరాత్‌బజార్, జాంబాగ్, బేగంబజార్, మహారాజ్ గంజ్, ఉస్మాన్‌గంజ్, ఇతర ప్రాంతాల్లో సైతం మౌళిక వసతుల రూపకల్పనకు తాను ప్రత్యేక కృషి చేస్తామన్నారు.

అగ్రసేన్ మహారాజ్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ప్రతినిధులు


అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పప్పుమాత్రే తదితరులు

అఫ్జల్‌గంజ్: అగ్రసేన్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు పప్పుమాత్రేతో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పప్పుమాత్రే మాట్లాడుతూ..ప్రజల ఐక్యతకు, ప్రజల శ్రేయస్సుకు మార్గాన్ని చూపించిన మహానీయుడు అగ్రసేన్ మహారాజ్ అని కొనియాడారు.

పాతబస్తీలో..

చార్మినార్: అగ్రసేన్ మహారాజ్ జయంతిని సోమవారం పాతబస్తీలో ఘనంగా నిర్వహించారు. చార్‌కమాన్‌లో జరిగిన వేడుకల్లో హైదరాబాద్ కుంభమేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ పాల్గొని అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అగ్రసేన్ మహారాజ్ చేసిన సేవలను కొనియాడారు.

ఆస్తి పన్ను చెల్లించని ఛాట్‌భాండార్‌లకు నోటీసులు


నోటీసులు జారీ చేస్తున్న డీసీ ఉమా ప్రకాష్ తదితరులు

అబిడ్స్: జీహెచ్‌ఎంసీకి ఆస్తిపన్ను చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రముఖ ఛాట్‌భాండార్‌లకు అబిడ్స్ జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బొగ్గులకుంటలోని నర్సింగ్ ఛాట్‌భాండార్, మయూర్ ఛాట్స్, క్రేజీ క్రీడలతో పాటు దాదాపు 10 మంది వ్యాపారులు పెద్ద ఎత్తున దుకాణాలు చలాయిస్తూ జీహెచ్‌ఎంసీకి సకాలంలో ఆస్తిపన్ను చెల్లించడం లేదు. దీంతో సోమవారం 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ ఆధ్వర్యంలో ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరీ, ఇతర అధికారుల బృందం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకే పీటీఐఎన్ ఆస్తిపన్ను చెల్లించే నెంబర్‌పై నర్సింగ్ ఛాట్‌భాండార్, మయూరి ఛాట్‌భాండార్‌లతో పాటు మొత్తం 10 మంది వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. కొంతకాలంగా రూ.80 లక్షలు జీహెచ్‌ఎంసీకి ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉండగా ఈ వ్యాపారులంతా చెల్లించడం లేదు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ..వారం రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించాలని లేనిచో నర్సింగ్ ఛాట్‌భాండార్, మయూర్ ఛాట్‌భాండార్ లతో పాటు మిగతా దుకాణాలను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఫుట్‌పాత్ కబ్జాచేసి వ్యాపారాలు..

నర్సింగ్ ఛాట్‌భాండార్‌తో పాటు మయూర్‌ఛాట్‌భాండార్, ఇతర దుకాణాల వారు ఫుట్‌పాత్‌ల పైనే ప్రతిరోజూ లక్షల రూపాయాల అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దాడులు చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమ వ్యాపారాలు చేస్తున్నవారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరం నడిబొడ్డున ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమంగా వ్యాపారాలను కొనసాగిస్తున్నా నగర ట్రాఫిక్ కానీ, ఇతర పోలీసులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి


ఫిర్యాదుల స్వీకరిస్తున్న అధికారులు

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలచే పరిష్కరిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి..

జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ఆస్తి పన్ను సమస్యలు, మొండి బకాయిల వసూళ్లపై ఆస్తి పన్ను విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రేటర్ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ఆదేశాలు మేరకు ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రతిఒక్కరూ తమ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలన్నారు. చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సురేందర్, మంగతయారు, సరిత, అరుణకుమారి, సురేందర్ రెడ్డి, ఏఎంసీలు, సుపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంప్



డీప్ సిబ్బందితో డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: ప్రారంభ దశలోనే మహిళల్లో రొమ్ము కేన్సర్‌ను గుర్తించవచ్చునని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. డీప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డీప్ సీఈఓ స్వాతి మోహంతితో కలిసి క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటువంటి స్క్రీనింగ్ క్యాంప్‌లు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తాయన్నారు. డీప్ సీఈఓ స్వాతి మోహంతి మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు వేలాది మంది మహిళలను స్క్రీనింగ్ చేశామన్నారు. ఈ క్యాంపులో డాక్టర్ రాకేష్‌కుమార్, ఆర్‌ఎంవో అమీనా, డీప్ ప్రతినిధి ఫణీంద్ర తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో బల్దియా వార్డు కార్యాలయం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాను ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి క్రమం తప్పకుండా బస్తీలు తిరుగుతుంటానని ఇటువంటి సందర్భాల్లో ప్రజలు తనను సమస్యలపై నిలదీస్తారన్నారు. బల్దియా అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా తమ తమ ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, అబీబ్‌చౌస్, సయ్యద్ ఆజాం తదితరులున్నారు.

విజయనగర్‌కాలనీలో ఉచిత వైద్య శిబిరం


ఉచిత శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

విజయనగర్‌కాలనీ: వయస్సుకు తగ్గ వ్యాయాయం చేస్తూ చక్కటి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ జీవితాన్ని ఆరోగ్యకరంగా ఆస్వాధించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జుమ్మడి వెంకటి అన్నారు. విజయనగర్‌కాలనీలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో గైనకాలజీ, పీడీయాట్రిక్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, జనరల్ ఫిజీషియన్, అప్తమాలజీతో పాటు దంత సంబంధమైన వ్యాధులను పరీక్షించి రోగులకు ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ హేమలత, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపురం ప్రియాంక, అరుణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిస్టర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులు షురూ


పనులను పరిశీలిస్తున్న స్వామి నాయక్

నాంపల్లి: మెహిదీపట్నం సర్కిల్-12 పరిధిలోని అహ్మద్ నగర్ డివిజన్‌లో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. లక్డీకాపూల్-మెహిదీపట్నం రోడ్డు మార్గం నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటోంది. ఈ రద్దీని తగ్గించేందుకు అధికారులు ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. ఇందులో భాగంగా సరోజినీదేవి ఆసుపత్రి పక్కన ఉండే రోడ్డు నుంచి బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12 ఖాజా మాన్షన్ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డు వెడల్పు పనులకు చేపట్టారు. రోడ్డు వెడల్పులో భాగంగా పలువురికి నోటీసులు జారీ చేశారు. సోమవారం ఈ రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ పనులను పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎల్.స్వామినాయక్ పర్యవేక్షించారు. 60 ఫీట్ల రహదారి పనుల్లో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ సంబరాల్లో ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో సోమవారం ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన విద్యార్థినులు ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.గంగాధర్, జి.మధుకర్, వినోద్‌గణేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు ఆలంగిరి రేణుకా, కోమటిరెడ్డి మహిపాల్‌రెడ్డితో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో..

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు 2వ రోజు అయిన సోమవారం రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు. శ్రీసాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలబతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సాహిత్య అకాడమి కార్యదర్శి బాలచారి, శ్రీసాయి అలేఖ్య సంస్థ వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్ పాల్గొన్నారు.

భవానీ ఎన్‌క్లేవ్ కాలనీలో..

చార్మినార్: భవానీ ఎన్‌క్లేవ్ కాలనీలో మహిళలు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో కాలనీ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, మాజీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి తదితరుల బృందం పాల్గొనగా..ప్రశాంత్‌గౌడ్ మహిళలతో కలిసి నృత్యం చేస్తూ బతుకమ్మ ఆడారు.


వేడుకల్లో భవాని ఎన్‌క్లేవ్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, మాజీ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి


వేడుకల్లో వీసీ గంగాధర్, రేణుకా తదితరులు